మొదటి పేజీ తరువాయి

## చివరి అంకం పూర్తి.. అద్భుతంగా ఖైరతాబాద్ గణేషుడి కళ్లు!



ఈ కబురు: భక్తులకు దర్శనం ఇచ్చేందుకు ఖైరతాబాద్ గణేషుడు సిద్ధమవుతున్నాడు. ప్రస్తుతం గణేషుడికి అలంకరణ జరుగుతోంది. ఈ సారి విగ్రహానికి ఒకవైపు పూరి జగన్నాధుడు, బలరాముడు, సుభద్ర, సహ లక్ష్మీ సమేత హయగ్రీవ స్వామి ఉన్నారు. మరోవైపు ఖైరతాబాద్ గ్రామ దేవత గజ్జల అమ్మవారు ఉన్నారు. గణేషుడు 70 అడుగుల ఎత్తు ఉండగా కళ్లు ఎంతో అద్భుతంగా కనిపిస్తున్నాయి.ఈ రోజే విగ్రహ నిర్మాణంలో చివరి అంకమైన కన్ను దిద్దడం పూర్తయ్యింది. డెబ్బై అడుగులతో నిర్మించిన శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతి నేత్రాలను శిల్పి రాజేందర్ గీశారు. రెండు కళ్లు అందంగా భక్తులందరివైపు చూస్తున్నట్టుగా కనిపిస్తున్నాయి. రెండు కళ్ల మధ్యలో ఎర్రని బొట్టు, నుదుటిన అడ్డబొట్టు మధ్యలో త్రిశూలంలో ముఖమంతా ప్రకాశవంతంగా మెరిసిపోతుంది. ఇప్పటికే గణేషుడిని చూసేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఇక చవితి నుండి నిమజ్జనం వరకు తొమ్మిది రోజులపాటు వినాయకుడు పూజలు అందుకుని భక్తులను దర్శించనున్నారు.

## నిమజ్జనమే కాదు.. ఆగమనమూ వేడుకే



హైదరాబాద్ సిటీ, ఈ కబురు: వినాయక చవితి అంటే.. మామూలు పండగ కాదు.. ఒక ఎమోషన్! పందిరి వెయ్యడం దగ్గర్నుంచీ.. నిమజ్జనం దాకా ప్రతిదీ ఒక వేడుకే. అయితే గతంలో పెద్దగా కనిపించని, ఈసారి మాత్రం ఎక్కువగా కనిపిస్తోన్న ధోరణి.. గణేశ ఆగమన వేడుకల నిర్వహణ. అదేమిటి అంటే.. వినాయక విగ్రహాలను తయారీదారుల నుంచి తాము ఏర్పాటుచేసిన మండపాల వద్దకు వేడుకగా తీసుకురావడం. మహిళలు సంప్రదాయ హారతులతో స్వాగతిస్తుండగా, సంగీతం, నృత్యం, బాణాసంచా పేలుళ్లతో గణనాధుడ్ని వైభవంగా తాత్కాలికంగా ఏర్పాటుచేసిన మండపాలలో ప్రవేశపెడుతున్నారు. నిమజ్జనం మాత్రమే ఎందుకు.. స్వామివారి ఆగమనమూ వేడుకే కదా అంటూ నేటి యువత ఆ సంబరాలనూ సందడిగా నిర్వహిస్తూ ఈ కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా.. రాజధాని నగరంలో దాదాపుగా అన్ని ప్రాంతాలలోనూ ఈసారి గణేశ ఆగమన వేడుకలు భారీ స్థాయిలో జరుపుతుండటం విశేషం. సామాజిక మాధ్యమాలు విస్తృతం కావడంతో ఇన్‌స్టా రీల్స్, యూట్యూబ్ షార్ట్స్‌లో లైక్స్ కోసం కూడా కొంతమంది వినాయక ఆగమనమూ వేడుకగా నిర్వహిస్తున్నారు. ఏర్పాట్లు ఘనంగా కనిపించేందుకు ప్రత్యేకంగా ధోల్ బృందాలను మహారాష్ట్ర లాంటి ప్రాంతాల నుంచి తీసుకురావడమే కాదు, భారీ సెట్టింగ్‌లనూ వేస్తున్నారు. ఇక బాణసంచా, డీజె, డ్రెస్ కోడ్, నృత్యాల గురించి ఎంత చెప్పినా తక్కువే. గత సంవత్సరం పాతబస్తీ, రాంనగర్‌లో ఈ ధోరణి కాస్త కనిపించింది కానీ, ఈ సారి నగరమంతా ఈ సందడి పాకింది. ఆగస్టు 18న కొత్తపేటలో, ఆగస్టు 20న 'లాల్ దర్వాజా కా రాజా' పేరిట పాతబస్తీలో ఆగమన యాత్ర అంగరంగ వైభోగంగా నిర్వహించారు. సుల్తాన్ బజార్, రాంనగర్ లలో కూడా భారీగానే ఈ తరహా యాత్రలు జరిగితే, మూసారాంభాగ్‌లోనూ 22 అడుగుల ఎత్తైన గణేశ విగ్రహాగమన వేడుకలు ఆకట్టుకున్నాయి. ఆగస్టు 24 న బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 14 వెంకటేశ్వర నగర్‌లో కూడా భారీస్థాయిలోనే ఆగమన వేడుకలు జరిగాయి. ఈసారి ఖైరతాబాద్ గణేశుని వద్ద కూడా ఈ ఆగమన యాత్ర నిర్వహించడం మారుతున్న ట్రెండ్‌కు అద్దం పడుతోంది. ఏకంగా ఆరు రకాల బ్యాండ్‌లు, భారీ ఏర్పాట్లతో అక్కడ వేడుక నిర్వహించడం విశేషం. ఈ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్.. స్థానిక యువతతో కలసి సరదాగా స్టెప్పులేశారు.

మొదటి పేజీ తరువాయి

# కొండాపూర్ లో రేవ్ పార్టీ భగ్నం..



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న మాదాపూర్ డిసిపి వినీత్

ఈకబురు, శేరిలింగంపల్లి : నగరంలో మరో డ్రగ్స్ పార్టీ గుట్టు రట్టయ్యింది. తెలంగాణ ఈగల్ టీమ్, గచ్చిబౌలి పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి కొండాపూర్ లో ఓ రేవ్ పార్టీని భగ్నం చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చి నగరంలో ఓ సర్వీస్ అపార్టుమెంటులో నిందితులు రేవ్ పార్టీ నిర్వహిస్తున్నారు. మొత్తం 6గురిని అరెస్టు చేయడంతో పాటు వారి వద్ద నుంచి 20 గ్రాముల కొకైన్, 20 గ్రాముల ఎసాస్టీ పిల్స్, 3 గ్రాముల ఎండిఎంఏను స్వాధీనం చేసుకున్నారు. వీరికి బెంగళూరుకు చెందిన రాహుల్ అనే సరఫరాదారుడు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు గుర్తించగా, రాహుల్ పరారీలో ఉన్నాడు. రాజమండ్రికి చెందిన ఓ డిప్యూటీ తాహాశీల్దార్ నిర్వహించిన రేవ్ పార్టీలతో ఈ రాహుల్ వీరికి పరిచయం అయినట్లు పోలీసులు గుర్తించారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాదాపూర్ డిసిపి వినీత్ వెల్లడించారు...

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఈస్ట్ గోదావరి జిల్లా రావులపాలెంకు చెందిన తేజ(28) నగరంలోని ప్రగతి నగర్ లో క్లౌడ్ కిచెన్ బిజినెస్ చేస్తున్నాడు. ఈస్ట్ గోదావరి పరిధిలోని జొన్నాడకు చెందిన పౌల్ట్రీ ఫాం వ్యాపారి విక్రం నగరానికి వచ్చి శేరిలింగంపల్లిలో నివాసం ఉంటున్నాడు. రాజమండ్రికే చెందిన మన్నే నీలిమా(41) నగరానికి వచ్చి నార్సింగిలో నివాసం ఉంటుంది. కాగా వీరు ముగ్గురు స్నేహితులు. వీరు గతంలో ఆంధ్రప్రదేశ్ లో ఉన్న సమయంలో అక్కడ రేవ్ పార్టీలకు వెళ్లి డ్రగ్స్ తీసుకోవడం అలవాటు చేసుకున్నారు. రాజమండ్రిలో ఉన్న మణిదీప్ అనే డిప్యూటీ తాహాశీల్దార్ అక్కడ తరచూ నిర్వహించే రేవ్ పార్టీలకు వీరు వెళ్లే వారు. మణిదీప్ బెంగళూరు, గోవాలలో సైతం డ్రగ్స్ పార్టీలు నిర్వహించగా. గోవాలో 2023లో నిర్వహించిన డ్రగ్స్ పార్టీకి వీరు ముగ్గురు వెళ్లారు. అక్కడ వీరికి డ్రగ్స్ సప్లయర్ రాహుల్ పరిచయం అయ్యాడు. రాహుల్‌తో పరిచయం పెంచుకున్న వీరు నేరుగా డ్రగ్స్ తెప్పించుకునే వారు. ఈ క్రమంలో తేజ, విక్రమ్, నీలిమాలు నగరానికి మకాం మార్చి ఇక్కడ పలు ప్రాంతాల్లో సర్వీసు అపార్టుమెంట్లలో



పోలీసులు అరెస్టు చేసిన రేవ్ పార్టీ నిందితులు, స్వాధీనం చేసుకున్న డ్రగ్స్

గదులు తీసుకున్నారు. అందులో తరచూ డ్రగ్స్ పార్టీలు చేసుకునే వారు. చర్మం ప్రకాశించేందుకు వాడే గ్లుటాథోన్ విటమిన్ ఇంజక్షన్లు వాడే అలవాటు తేజాకు ఉంది. నగరంలో వీటి ధర 40వేలు ఉండగా, బెంగళూరులో 11వేలకే దొరుకుతున్నాయి. దీంతో గ్లుటాథోన్ ఇంజక్షన్లను ఆర్డర్ చేసి వాటి మాటున బెంగళూరులో ఉండే రాహుల్ డ్రగ్స్ ను తేజాకు సరఫరా చేసేవాడు. ఈ క్రమంలో కొండాపూర్లోని రాజేశ్వరీ నిలయం సర్వీసు అపార్టుమెంటులో గదులు తీసుకున్న వీరు రేవ్ పార్టీ కోసం పథకం వేశారు. వీరి వద్దకు బెంగళూరులో ఉంటూ ఇంజనీరింగ్ చదువుతున్న చందన్(20)తో డ్రగ్స్ ఇచ్చి రాహుల్ పంపించాడు. అనంతరం ఈనెల 24వ తేదీన తేజ, విక్రమ్, నీలిమలతో పాటు కొండాపూర్ లో వైన్ షాపు యజమాని పురుషోత్తం రెడ్డి(36), సైబర్ మిడోస్ లో నివాసం ఉండే సాఫ్టువేర్ ఉద్యోగి భార్గవ్(31)లు కలిసి సర్వీసు అపార్టుమెంటులో రేవ్ పార్టీ చేసుకుంటున్నారు. వీరికి రాహుల్ పంపించిన డ్రగ్స్ ను చందన్ సరఫరా చేశాడు. ఈ రేవ్ పార్టీ మీద సమాచారం అందుకున్న తెలంగాణ ఈగల్ టీమ్, గచ్చిబౌలి పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి పార్టీని భగ్నం చేశారు. పార్టీలో ఉన్న తేజ, విక్రమ్, నీలిమా, పురుషోత్తంరెడ్డి, భార్గవ్‌లతో పాటు డ్రగ్స్ రవాణా చేసిన చందన్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరిని అరెస్టు చేసి 20 గ్రాముల కొకైన్, 20 గ్రాముల ఎసాస్టీ పిల్స్ 3 గ్రాముల ఎండిఎంఎ స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ వరఫరా చేసిన రాహుల్, రాహుల్‌ను పరిచయం చేసిన డిప్యూటీ తాహాశీల్దార్ మణిదీప్ లు పరారీలో ఉన్నారు. పట్టుబడిన విక్రమ్ మీద గతంలో పలు కేసులు నమోదయ్యాయని డిసిపి తెలిపారు. సమావేశంలో ఏసిపి శ్రీధర్, గచ్చిబౌలి ఇన్స్ పెక్టర్ హబీబుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## గచ్చిబౌలిలో రెచ్చిపోయిన ప్రైవేటు హాస్టల్ నిర్వాహకులు

- భవన యజమానులపై దాడి - పలువురికి గాయాలు
- కోర్టు ఉత్తర్వులతో హాస్టల్ ఖాళీ చేయిస్తుండగా ఘటన



హాస్టల్ యజమానుల దాడిలో గాయపడిన ఇంటి యజమాని

ఈకబురు, శేరిలింగంపల్లి : గచ్చిబౌలిలో ప్రైవేటు వర్కింగ్ హాస్టల్ నిర్వాహకులు రెచ్చిపోయారు. అద్దెకు తీసుకున్న భవనాల్లో ఎళ్ల తరబడి అద్దెలు చెల్లించకుండా తిష్ట వేయడంతో పాటు కోర్టు ఆదేశాలతో హాస్టళ్లు ఖాళీ చేయించేందుకు వచ్చిన యజమానులపై దాడులకు తెగబడ్డారు. హాస్టల్ నిర్వాహకుడికి అండగా వచ్చిన మరికొంతమంది హాస్టల్ నిర్వాహకులు, వారి అనుచరులు కలిసి భవన యజమానుల మీద విచక్షణారహితంగా దాడి చేసి కొట్టారు. ఈ దాడుల్లో పరువురికి తీవ్ర గాయాలు కాగా, యజమానుల నెత్తులు పగిలాయి. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు బాధితుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి...

గచ్చిబౌలిలోని ఇందిరానగర్ లో ఉన్న కోదూరు మాన్షన్ అపార్టుమెంటులో ఉన్న 20 ప్లాట్లను వాటి యజమమానులు 2016లో అమర్నాథ్ రెడ్డి అనే వ్యక్తికి హాస్టల్ నిర్వహణ కోసం అద్దెకు ఇచ్చారు. ఇందులో అమర్నాథ్ రెడ్డి ఎవర్ గ్రీన్ స్టే పేరుతో హాస్టల్ నిర్వహిస్తున్నాడు. వీరి మధ్య అగ్రిమెంటు 2020లో ముగిసింది. కాగా అమర్నాథ రెడ్డి సక్రమంగా అద్దె చెల్లించకపోవడంతో యజమానులు హాస్టల్ ఖాళీ చేయాలని ఒత్తిడి చేశారు. హైటెక్ సిటీ ప్రైవేటు హాస్టల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న అమర్నాథ్ రెడ్డి హాస్టల్ ఖాళీ చేయకపోగా, యజమానులను దబాయిస్తూ గత ఐదేళ్లుగా అద్దె సైతం చెల్లించడం లేదు. దీంతో ప్లాట్ల యజమానులు కోర్టును ఆశ్రయించారు. ఒక్కో ప్లాటు మీద దాదాపు 17 లక్షల అద్దె బకాయిలు ఉండడం, అమర్నాథ్ రెడ్డి అద్దె చెల్లించకపోవడం, లీజు అగ్రిమెంటు ముగియడంతో హాస్టల్ ఖాళీ చేయాలని రంగారెడ్డి జిల్లా కోర్టు తీర్పు ఇచ్చింది. గతంలో కోర్టు ఉద్యోగుల సమక్షంలో 9 ప్లాట్లను ఖాళీ చేయించారు. మరో 6 ప్లాట్లను ఖాళీ చేయాలని వారం క్రితం కోర్టు ఆదేశాలు ఇవ్వడంతో సోమవారం హాస్టల్ ను ఖాళీ చేయించేందుకు యజమానులు, కోర్టు ఉద్యోగులు, యజమానుల తరవున ఉన్న అడ్వకేటు కోదూరు మాన్షన్ భవనం వద్దకు వచ్చారు. అదే సమయంలో హాస్టల్ నిర్వాహకుడు అమర్నాథ్ రెడ్డి మరికొంత మంది హాస్టల్ నిర్వాహకులు, అనుచరులతో కలిసి దాదాపు 30మంది ఒక్కసారిగా యజమానుల మీద దాడి చేశారు. కర్రలు, రాడ్లతో దాడులకు తెగబడడంతో ప్లాట్ల యజమానులు కోదూరు పిశ్వేశ్వరరావు, రజనీ, సునీష్, శ్రీధర్, ప్రసూనాంభ తదితరులకు గాయాలయ్యాయి. పిశ్వేశ్వరరావుకు తల పగిలి



వివాదానికి కారణమైన కోదూరు మాన్షన్ హాస్టల్ భవనం

తీవ్ర గాయమైంది. అమర్నాథ్ రెడ్డి అనుచరుల దాడిలో అడ్వకేటు, కోర్టు ఉద్యోగులకు సైతం గాయాలయ్యాయి. దీంతో బాధితులు గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించగా, గాయపడిన వారిని పోలీసులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే అమర్నాథ్ రెడ్డి, అతని అనుచరులు సంఘటనా స్థలం నుంచి పారిపోయారు. ఈమేరకు బాధితుల పిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## కమిషనర్ సివి.ఆనంద్ ను కలిసిన వేకప్ హ్యూమానిటీ ఆర్గనైజేషన్

ఈకబురు, హైదరాబాద్ : హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సివి.ఆనంద్ ను సోమవారం వేకప్ హ్యూమానిటీ ఆర్గనైజేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ కు మెమెంటోను అందజేసి సత్కరించారు. దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన నషాముక్త భారత్ కార్యక్రమం విజయవంతంగా జరిగిందని, వేకప్ హ్యూమానిటీ ఆర్గనైజేషన్ బాటలో మరిన్ని ఆర్గనైజేషన్లు ముందుకు వచ్చి ఇటువంటి కార్యక్రమాలు చేయాలని కమిషనర్ సివి ఆనంద్ సూచించారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేస్తుందని కమిషనర్ గుర్తుచేశారు. ఆర్గనైజేషన్ చేసే కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు. కమిషనర్ ను కలిసిన వారిలో వేకప్ హ్యూమనీటీ ఆర్గనైజేషన్ ఫౌండర్ సయ్యద్ నూర్, టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అసాద్, శ్రీని ఇన్ ఫ్రా ఎండి శ్రీని, స్టార్ ఫిలిం ఫ్యాక్టరీ ప్రొడ్యూసర్ అసిఫ్ జానీ, అడ్వకేట్ లలిత్ సాదిక్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.




కమిషనర్ తో కలిసి వేకప్ హ్యూమానిటీ ఆర్గనైజేషన్

## అమెరికాలో లాబీయింగ్‌కు భారత్ ముమ్మర యత్నాలు..!



ఈ కబురు: అమెరికా విధించిన అదనపు సుంకాలు అమల్లోకి రావడానికి కొన్ని రోజుల ముందే భారత్ లాబీయింగ్ యత్నాలను ముమ్మరం చేసింది. ఈక్రమంలో అక్కడి ప్రభుత్వంతో వ్యూహాత్మక అంశాల్లో కమ్యూనికేషన్లు నిర్వహించడం, సోషల్ మీడియా, మీడియా రిలేషన్స్, డిజిటల్ ఆడిట్ వంటి వాటిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక సంస్థను నియమించుకొంది. ఫారెన్ ఏజెంట్ రిజిస్ట్రేషన్ ఫైలింగ్ ప్రకారం.. భారత దౌత్య కార్యాలయం నెలకు 75,000 డాలర్లు చెల్లించేలా మూడు నెలలకు మెర్క్యూరీ పబ్లిక్ అఫైర్స్ సంస్థతో ఒప్పందం చేసుకొంది. ఇది ఆగస్టు 15 నుంచి అమల్లోకి వచ్చింది. మెర్క్యూరీ సంస్థ మాజీ రిపబ్లికన్ సెనెటర్ డేవిడ్ విట్టర్, 2020 ట్రంప్ ట్రాన్సిషన్ బృందం కమ్యూనికేషన్స్ డైరెక్టర్‌గా చేసిన బ్రయాన్‌తో కలిసి భారత్ కోసం పనిచేస్తుంది. న్యూయార్క్ రాష్ట్రానికి సెనెటర్‌గా ఎన్నికైన తొలి ఇండోఅమెరికన్ కెవిన్ థామస్ సాయం చేయనున్నారు. ప్రస్తుతం ట్రంప్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ సూసీ విలిస్‌కు మెర్క్యూరీ సంస్థతో సంబంధాలున్నాయి. 2024 వరకు ఆమె ఈ సంస్థ కోసం రిజిస్టర్డ్ లాబీయిస్ట్‌గా పనిచేశారు. ఆ తర్వాత శ్వేతసౌధంలో బాధ్యతలు చేపట్టారు. బ్రయాన్ గతంలో ట్రంప్ ప్రచార బృందంలో, జేడీవాన్స్ సెనెట్‌కు పోటీ చేసినప్పుడు పనిచేశారు. విమర్శలు వచ్చాక..ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత పాకిస్థాన్ చాలా వేగంగా ఆయనతో సంబంధాలను బలోపేతం చేసుకొంది. భారత్ మాత్రం కొంత వెనకబడిందనే విమర్శలు వచ్చాయి. ఇక పాక్ నాయకత్వం ట్రంప్ మాజీ బాడీగార్డ్ కీత్ షల్లర్ నిర్వహిస్తున్న లాబీయింగ్ సంస్థను నియమించుకొంది. మరోవైపు భారత్ ఇప్పటికే ట్రంప్ మాజీ సహాయకుడు జేసన్ మిల్లర్‌కు చెందిన ఎస్‌హెచ్‌డబ్ల్యూ పార్టనర్స్ ఎల్‌ఎల్‌సీని నియమించుకొని నెలకు 1.50లక్షల డాలర్లు చెల్లిస్తున్నాం. అమెరికాలో కీలకమైన ఒప్పందాలు, ఇతర పనులను పూర్తిచేసుకోవడానికి లాబీయింగ్ సంస్థలను నియమించుకోవడం కొత్తేమీ కాదు. చాలా దేశాలు వీటితో కలిసి పనిచేస్తుంటాయి.రష్యాను అదుపు చేయడానికే భారత్‌పై చర్యలు.. రష్యా దూకుడును అదుపు చేయడానికి ట్రంప్ సర్కారు చాలా చర్యలు తీసుకొందని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వెల్లడించారు. దీనిలోభాగంగానే భారత్‌పై సెకండరీ టారిఫ్‌లు విధించినట్లు పేర్కొన్నారు. ఆయన ఎన్‌బీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు.

## వేగంగా 'యాంటీబయాటిక్స్' టెస్ట్.. పరికరాన్ని రూపొందించిన ఐఐటీ మద్రాస్



ఈ కబురు: వ్యాధికారక బ్యాక్టీరియా.. యాంటీబయాటిక్స్ నిరోధకతను కలిగి ఉందా? లేదా అనే విషయాన్ని వేగంగా, తక్కువ ఖర్చుతో గుర్తించగల పరికరాన్ని ఐఐటీ మద్రాస్ పరిశోధకులు అభివృద్ధి చేశారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అనేక పరీక్ష పద్ధతులు ఎంతో సంక్లిష్టతతో కూడి ఉన్నాయి. అదేవిధంగా.. దీనికోసం అధిక నైపుణ్యం కలిగినవారు అవసరం. ఐఐటీ మద్రాస్ పరిశోధకులు అభివృద్ధి చేసిన పరికరం.. చిన్న క్లినిక్‌లు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లోనూ ఉపయోగించేలా అనుకూలంగా ఉంటుంది. మూడు గంటల్లోపు ఫలితాలను అందిస్తుంది.ఐఐటీ మద్రాస్ పరిశోధకులు అభివృద్ధి చేసిన పరికరం.. సాధారణ మైక్రోఫ్లూయిడ్ చిప్‌లో పొందుపర్చిన స్క్రీన్‌ప్రింటెడ్ కార్బన్ ఎలక్ట్రోడ్‌లపై ఆధారపడి ఉంది. "సులభంగా వాడుకునేలా ఈ పరికరాన్ని రూపొందించాం. బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లను ముందస్తుగా గుర్తించేందుకు, మెరుగైన చికిత్స అందించేందుకు ఇది దోహదపడుతుంది. అధునాతన ప్రయోగశాలల సౌకర్యం లేని మారుమూల ప్రాంతాల్లోనూ దీన్ని వినియోగించొచ్చు. ప్రస్తుతం ఐఐటీఎం ఇన్‌స్టిట్యూట్ హాస్పిటల్‌తో కలిసి క్లినికల్ పరీక్షలు చేస్తున్నాం. అనంతరం అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నాం" అని ఐఐటీ మద్రాస్ కెమికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఎస్.పుష్పవనం వెల్లడించారు.యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అంశం ప్రపంచాన్ని కలవరపాటుకు గురిచేస్తోంది. ఏఎంఆర్‌తో మానవాళికి ముప్పు పొంచి ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్ వాడితే వాటిని ఎదుర్కొనే సామర్థ్యం వ్యాధికారక సూక్ష్మజీవులు పొందుతాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒక నిర్దిష్ట ఇన్ఫెక్షన్‌కు ఏ యాంటీబయాటిక్స్ పనిచేస్తాయో గుర్తించేందుకు యాంటీమైక్రోబయల్ ససెప్టబిలిటీ టెస్టింగ్ నిర్వహిస్తుంటారు. వైద్యులు సరైన చికిత్సను అందించేందుకు, యాంటీబయాటిక్స్ దుర్వినియోగాన్ని నివారించేందుకు దీని ఫలితాలు సాయపడతాయి.

## అడిగినవన్నీ ఇస్తున్నా.. ఆందోళన ఏంటి



హైదరాబాద్, ఈ కబురు: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఆందోళన బాట పట్టాల్సిన అవసరం ఎందుకొచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. 'ఉద్యోగులు అడిగినవి ఒక రోజు అటూ ఇటూగా చేస్తూనే ఉన్నాం కదా? అయినా ఆందోళన బాట పట్టాల్సిన అవసరం ఎందుకొచ్చింది? దీనికి బాధ్యులు ఎవరు? ఆర్థిక ఇబ్బందుల వల్ల బిల్లుల చెల్లింపులో కొంత జాప్యం జరిగినా.. ఎంతో కొంత మేలు జరుగుతూనే ఉందిగా? ఉద్యోగులతో సమావేశం అయ్యాక డిమాండ్ల అమలు కోసం మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటు చేశాం. అధికారుల కమిటీ ఏర్పాటు చేసి నివేదిక తీసుకున్నాం. ఆ నివేదిక వచ్చాక మంత్రిమండలిలో చర్చించి, చేస్తామని చెప్పిన అంశాలు కూడా ఎందుకు పరిష్కరించలేకపోతున్నాం' అని సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గ సహచరుల వద్ద అసంతృప్తి చేసినట్లు సమాచారం. ఉద్యోగుల ఆందోళనలకు బీజేపీ మద్దతు ప్రకటించి, రాజకీయ లబ్ధి పొందాలనే పరిస్థితి ఎలా వచ్చిందనే చర్చ కూడా జరిగినట్లు తెలుస్తోంది. మరోవైపు 'ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలని సంబంధిత మంత్రి, కార్యదర్శిని పదేపదే కలిసి విజ్ఞప్తి చేసినా స్పందన లేదు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని సీఎం ప్రధాన కార్యదర్శిని కోరితే స్పందించడం లేదు. జేఏసీ పెట్టిన 63 డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లేదు. అందుకే ఈ నెల 19న జేఏసీ సమావేశం ఏర్పాటు చేసి, కార్యాచరణ ప్రకటించాం. ఉమ్మడి పది జిల్లాల్లో బస్సు యాత్రలు చేయాలని నిర్ణయించాం' అని ఉద్యోగ సంఘాల జేఏసీ చెబుతోంది. ఇక ఉద్యోగుల ఆందోళనకు బీజేపీ మద్దతు తెలపడంతో సీఎం రేవంత్ శుక్రవారం రాత్రి భట్టి విక్రమార్కతో సుమారు మూడు గంటలపాటు చర్చించినట్లు తెలిసింది. శనివారం ఉదయం ఉద్యోగ సంఘాల నేతలతో సమావేశమైన భట్టి.. తొలుత వారిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. అడిగినవన్నీ చేస్తున్నా.. ఎందుకు ఆందోళన చేస్తున్నారని ప్రశ్నించినట్లు తెలిసింది. కింది స్థాయిలో ఉద్యోగులు సామాజిక మాధ్యమాల ద్వారా సంఘాల నాయకులను అల్లరి చేస్తున్నారని వారు సమాధానమిచ్చినట్లు సమాచారం. దీంతో బీఆర్ఎస్ పాలనలో ఉన్న సమస్యలే మళ్లీ కావాలా? అని భట్టి ఉద్యోగులను ప్రశ్నించగా.. 'అలా వ్యవహరిస్తే మీ ప్రభుత్వానికి కూడా లీడర్లే ఉంటారు తప్ప.. క్యాడర్ ఉండదు' అని జేఏసీ ప్రతినిధులు బదులిచ్చినట్లు తెలిసింది. శనివారం సమావేశం అర్ధంతరంగా ముగియడంతో సోమవారం మరోసారి భట్టి నుంచి పిలుపొచ్చింది. అయితే జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ అందుబాటులో లేకపోవడంతో సమావేశం వాయిదా పడింది. ఉద్యోగులు ఉద్యమ కార్యాచరణను ఆపాలని సీఎం సూచించడంతో మంత్రులు వారిని బుజ్జగించే పనిలో పడ్డారు.

## భారత్‌అమెరికా మధ్య ట్రంప్ పెట్టిన మరో చిచ్చు..!

ఈ కబురు: అమెరికాఅధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు భారత్‌అమెరికా సంబంధాలను తీవ్రస్థాయిలో దెబ్బతీస్తున్నాయి. తాజాగా అత్యంత వివాదాస్పదమైన వ్యక్తుల్లో ఒకరైన సెర్గియో గోర్‌ను భారత్ అమెరికా రాయబారిగా, దక్షిణ, మధ్యఆసియాలో పర్యవేక్షకుడిగా నియమించడం దౌత్యవర్గాలను షాక్‌కు గురిచేసింది. ఒకప్పుడు భారత్ తీవ్రంగా వ్యతిరేకించిన పనినే ట్రంప్ బలవంతంగా చేశారు. 38 ఏళ్ల గోర్‌పై ట్రంప్‌నకు విపరీతమైన నమ్మకం ఉంది. ఇతడు చెప్పిన మీదటే నాసా చీఫ్ నియామకాన్ని చివరి నిమిషంలో మార్చేశారు.

భారత్ ప్రాధాన్యం తగ్గించినట్లా..?

గోర్‌నియామకంపై భారత్‌లో మిశ్రమ స్పందన వస్తోంది. విదేశీ వ్యవహారాల నిపుణుడు, మాజీ దౌత్యవేత్త కన్వల్ సిబల్ స్పందిస్తూ భారత్‌లో నియమించిన దౌత్యవేత్తను దక్షిణ, మధ్య ఆసియాకు ప్రత్యేక దూతగా నియమించడం ఇదే తొలిసారి అన్నారు. పాకిస్థాన్ సహా పొరుగుదేశాలతో భారత్‌కు ఉన్న సంబంధాలను అతడు గమనిస్తాడన్నది వాస్తవమని పేర్కొన్నారు. అయితే.. ఈ చర్య భారత్, పాకిస్థాన్‌ను ఒకేగాటన కట్టినట్లవుతుందని.. ఇలాంటి అమెరికా వైఖరిని న్యూఢిల్లీ గతంలో తీవ్రంగా వ్యతిరేకించిందన్నారు. అంతేకాదు.. ఇక భారత్‌అమెరికా సంబంధాల్లో ఇండోపసిఫిక్ ప్రాధాన్యం కనుమరుగవుతుందని చెప్పారు.మరో మాజీ దౌత్యవేత్త నిరుపమారావ్ కూడా ట్రంప్ ఉద్దేశాలను ప్రశ్నించారు. ఈ నియామకం భారత్‌అమెరికా సంబంధాలను దెబ్బతీస్తుందన్నారు. గోర్ దౌత్యవేత్త కాకపోవడం, భారత్, దక్షిణాసియాలో అతడికి అనుభవం లేకపోవడం ఇబ్బందికరమన్నారు. కేవలం వీరవిధేయతే ఏకైక అర్హతన్నారు. అధ్యక్షుడి అజెండాను ముందుకుతీసుకెళ్లడానికే అతడిని నియమించారన్నారు. అది భారత్‌తో సంబంధాలను బలోపేతం చేస్తుందని చెప్పలేమన్నారు. అమెరికా అనుసరించే పాక్‌అఫ్ఘాన్ పాలసీతో భారత్‌ను కూడా కలపడం ఇబ్బందికరమే అని తెలిపారు. వ్యక్తిగతంగా తనకు అత్యంత సన్నిహితుడైన వ్యక్తిని భారత్‌లో నియమించి ట్రంప్ నుంచి మోదీ ప్రభుత్వానికి బలమైన సంకేతాలు వెళ్లాయని పొలిటికో పత్రిక పేర్కొంది. అధ్యక్షుడి నుంచి వచ్చే అభ్యంతరాలు, ఇతర సందేశాలపై భారత్ కూడా తీవ్రంగా పరిగణించి.. చర్చలు జరపాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. నాడు ఒబామా ప్రయత్నాన్ని వ్యతిరేకించిన భారత్..2009లో బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కూడా భారతపాక్‌అఫ్గానిస్థాన్‌ను ఒకే పాలసీ కిందకు తెచ్చేందుకు యత్నించారు. నాడు రిచర్డ్ హోల్‌బ్రూక్‌ను ఈ ప్రాంతం మొత్తానికి ప్రత్యేక రాయబారిగా నియమించారు. అయితే.. నాటి భారత విదేశాంగ మంత్రి ప్రణబ్ ముఖర్జీ దీనిపై అమెరికా రాయబారి డేవిడ్ మల్‌ఫోర్డుకు తమ అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ చర్య భారత్‌కు ఆమోదయోగ్యం కాదన్నారు. దీంతో నాడు బ్రూక్‌ను పాక్‌అఫ్గానిస్థాన్‌కు మాత్రమే పరిమితం చేసినట్లు వికీలీక్స్‌లో బహిర్గతమైన పత్రాల్లో తేలింది. ఇప్పుడు ట్రంప్ భారత్‌కు నచ్చని అటువంటి చర్యే తీసుకొన్నారు.



# టెక్ దిగ్గజం అతిపెద్ద డీల్.. నెలకు రూ.5.4 కోట్ల రెంట్!

ప్రముఖ టెక్ దిగ్గజం తన కార్యకలాపాలను విస్తరించడంలో భాగంగా ఎప్పటికప్పుడు కొత్త ఆఫీసులను ప్రారంభిస్తూనే ఉంది. ఇందులో భాగంగానే మైక్రోసాఫ్ట్ ఇండియా ఆర్ అండ్ డి హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలోని ఫీనిక్స్ సెంటారస్‌లో 2.65 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని లీజుకు తీసుకుంది. ఇక్కడ 3, 4వ అంతస్తులలో ఆఫీస్ ఉంటుంది.

టేబుల్‌స్పేస్ టెక్నాలజీస్‌తో ఒప్పందం ఐదు సంవత్సరాలు కాగా.. నెల అద్దె రూ. 5.4 కోట్ల చొప్పున చెల్లిస్తుంది. ఇది 2025 జులై 1 నుంచి అమల్లోకి వచ్చినట్లు రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ ప్రాప్ స్టాక్ వెల్లడించింది. ఈ ఒప్పందానికి స్టాంప్ డ్యూటీ అండ్ రిజిస్ట్రేషన్ ఛార్జీలుగా టెక్ దిగ్గజం రూ.92.94 లక్షలు చెల్లించినట్లు తెలుస్తోంది.




లీజు పత్రాల ప్రకారం.. మొత్తం చెల్లింపు చదరపు అడుగుకు రూ.67 బేస్ అద్దెతో పాటు.. నిర్వహణ ఛార్జీలు, నిర్వహణ ఖర్చులు, మూలధన ఖర్చులు, నిర్వహణ రుసుములు ఉన్నాయి. ఈ ఒప్పందం ప్రకారం ప్రతి ఏడాది అద్దె 4.8 శాతం పెరుగుతుంది. కాగా కంపెనీ ఐదేళ్ల కాలానికి రూ.42.15 కోట్ల సెక్యూరిటీ డిపాజిట్ చేసింది.

**హైదరాబాద్‌లో ఇతర భారీ ఆఫీస్ డీల్స్**

హైదరాబాద్‌లోని ఇతర భారీ డీల్స్ విషయానికి వస్తే.. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ 2024లో 10.18 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని లీజుకు తీసుకుంది. దీని అద్దె నెలకు రూ. 4.3 కోట్లుగా ఉంది. అదేవిధంగా, డిసెంబర్ 2024లో, ఫేస్‌బుక్ తన హైదరాబాద్ ఆఫీస్ స్థలం కోసం లీజును రెన్యువల్ చేసింది. ఇది మొత్తం 3.7 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. దీని అద్దె నెలకు రూ.2.8 కోట్లు.

# 'సోషల్ మీడియా వ్యసనపరులు కావలెను'.. ముంబయి సీఈవో షాకింగ్ ప్రకటన

**ఒక కంపెనీ సీఈఓ ఇచ్చిన జాబ్ ఆఫర్ చర్చనీయాంశంగా మారింది. సోషల్ మీడియాలో ఎక్కువ సమయం గడిపేవారికి ఉద్యోగం ఇస్తామని తన ప్రకటనలో పేర్కొన్నారు. ముంబయిలోని మాంక్ ఎంటర్‌టైన్‌మెంట్ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు విరాజ్‌సేథ్ ఈ జాబ్ ఆఫర్ చేశారు.**

''మాంక్‌ఇలో పనిచేసేందుకు డూమ్ స్క్రోలర్స్ కావాలి. స్క్రీన్ స్క్రోల్ చేస్తూ తాజా విషయాలపై అవగాహన కలిగిఉండాలి. ఉద్యోగానికి దరఖాస్తు చేసుకునేవారు కనీసం ఆరు గంటలు ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్ ను స్క్రోల్ చేయాలి. కంటెంట్ క్రియేటర్ కల్చర్‌లో నిమగ్నమై ఉండాలి. కంటెంట్ క్రియేటర్ల గురించి తెలిసిఉండాలి'' అని చేయాల్సిన పని గురించి విరాజ్ లింక్డిన్, ఇన్‌స్టాగ్రాం స్టోరీస్‌లో పోస్టు పెట్టారు. అలాగే హిందీ, ఇంగ్లిష్‌లో నైపుణ్యం ఉండాలని, ఎక్సెల్ వాడకం తెలిసి ఉండాలని రాసుకొచ్చారు. ఇది ఫుల్‌టైం ఉద్యోగమని చెప్పారు. జీతం వివరాలను మాత్రం వెల్లడించలేదు.



ఈ ఉద్యోగ ప్రకటనపై నెట్టింట్లో భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ''నేను 19 గంటలు ఆన్‌లైన్‌లో ఉంటాను. అయితే నేను ఓవర్ క్వాలిఫైడా..?'' అని ఫన్నీగా కామెంట్ పెట్టారు. ''కాలం మారింది. సోషల్ మీడియా అధికంగా వాడటం గతంలో ప్రమాదకరం అనేవారు. ఇప్పుడు ఫుల్ టైమ్ జాబ్ లభిస్తోంది'' అని ఇంకొకరు పోస్ట్ చేశారు. ''ఎక్కువ టైం స్క్రీన్ చూస్తే .. ఇప్పుడు జీతం లభించనుంది'' అంటూ స్పందనలు వ్యక్తమవుతున్నాయి.




ఎక్కువ సమయంలో ఫోన్ స్క్రీన్ స్క్రోల్ చేస్తూ గడిపేవారిని డూమ్ స్క్రోలర్ అని అంటారు. ముఖ్యంగా వారు స్క్రోల్ చేసే వాటిలో ప్రతికూల, ఆందోళన కలిగించే స్టోరీస్ ఉంటాయి. తర్వాత కాలంలో ఆ పదానికి అర్థం మారింది. ఎక్కువ సమయం స్క్రీన్ చూసేవారిని ఎవరినైనా డూమ్ స్క్రోలర్‌గా పిలుస్తున్నారు. ఇక, డిజిటల్ మీడియా ఏజెన్సీ మాంక్ ఎంటర్‌టైన్‌మెంట్ వ్యవస్థాపకుల్లో రణవీర్ అల్లాబాదియా కూడా ఉన్నారు. అతడు కొన్ని నెలల క్రితం వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే. ఓ హాస్య కార్యక్రమంలో పాల్గొన్న వ్యక్తిని తల్లిదండ్రుల గురించి, శృంగారం పైన ప్రశ్నించి వివాదాల్లో చిక్కుకున్నారు.



## రెనో నుంచి కైగర్ ఫేస్‌లిఫ్ట్.. ధర రూ.6.29 లక్షల నుంచి ప్రారంభం

ప్రముఖ కార్ల తయారీ సంస్థ రెనో తన కైగర్ శ్రేణిలో కొత్త కారును విడుదల చేసింది. రెనో కైగర్ ఫేస్‌లిఫ్ట్ పేరిట దీన్ని లాంచ్ చేసింది. దీని ధరలు రూ.6.29 లక్షల నుంచి రూ. 9.99 లక్షల వరకు ఉన్నాయి. ట్రైబర్ ఫేస్‌లిఫ్ట్ తర్వాత విడుదలైన ఈ కైగర్‌ను ఫీచర్ అప్‌డేట్స్, ఇంటీరియర్‌లో కొత్త హంగులతో తీసుకొచ్చారు.

దీనిలో 16 అంగుళాల కొత్త అల్లాయ్ వీల్స్ ఇచ్చారు. గ్రీన్ పెయింట్ స్కీమ్‌ను అందించారు. గత వెర్షన్‌లతో పోలిస్తే దీని ఇంటీరియర్‌లో బ్లాక్, గ్రే డ్యుయల్ టోన్ డాష్‌బోర్డ్ కొత్త లుక్ ఇస్తోంది. 6 ఎయిర్‌బ్యాగ్‌లు, 8 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇచ్చారు. హెడ్‌ల్యాంప్ హౌసింగ్, ఫాగ్‌ల్యాంప్‌లు, 360 డిగ్రీల కెమెరా వంటి సేఫ్టీ ఫీచర్లతో తీసుకొచ్చింది. సరికొత్త లుక్‌తో ఆకర్షించేందుకు బంపర్‌ను నూతనంగా తీర్చిదిద్దారు. ఇంజిన్ పరంగా కొత్త కైగర్‌లో రెండు ఆప్షన్లు అందిస్తున్నారు. 72 హెచ్‌పీ సామర్థ్యం గల 1 లీటర్ నేచురల్ ఆస్పిరేటెడ్ ఇంజిన్ ఒకటయితే 100 హెచ్‌పీ శక్తిని ఇచ్చే 1.0 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్ మరొకటి.

# పండగ సేల్స్.. ఫ్లిప్‌కార్ట్‌లో కొత్తగా 2.2 లక్షల తాత్కాలిక ఉద్యోగాలు

**దిల్లీ: పండుగ సీజన్ దృష్ట్యా ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ పెద్ద ఎత్తున తాత్కాలిక నియామకాలను చేపట్టింది. బిగ్ బిలియన్ డేస్ సమయంలో కస్టమర్ల తాకిడిని తట్టుకోవడానికి ఈ నిర్ణయం తీసుకుంది. సప్లయ్ చైన్, లాజిస్టిక్స్, లాస్ట్ మైల్ డెలివరీ రంగాల్లో 2,20,000కు పైగా తాత్కాలిక ఉద్యోగావకాశాలు కల్పించినట్లు ప్రకటించింది. లాజిస్టిక్ నెట్‌వర్క్‌లో టైర్-2, టైర్-3 నగరాల్లో 650 కొత్త ఫెస్టివ్-ఓన్లీ డెలివరీ హబ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది.**

బిగ్ బిలియన్ డేస్ 28 రాష్ట్రాల్లో మౌలికవసతులు, టెక్నాలజీ డిప్లాయ్‌మెంట్‌తో పాటు ఉద్యోగాల సృష్టిపై దృష్టి పెట్టినట్లు ఫ్లిప్‌కార్ట్ వెల్లడించింది. ఈ సీజనల్ ఉద్యోగాలు వేర్‌హౌసింగ్, డెలివరీ, టీమ్ లీడ్స్, కస్టమర్ ఎక్స్‌పీరియెన్స్ విభాగాల్లో ఉంటాయి. పికర్స్, ప్యాకర్స్, సార్టర్స్, డెలివరీ ఎగ్జిక్యూటివ్‌లు రోల్స్ ఉంటాయి. "AI ఆధారిత టూల్స్‌తో మా సప్లయ్ చైన్ వేగవంతంగా, భవిష్యత్తు అవసరాలకు తగిన విధంగా సిద్ధమవుతోంది" అని ఫ్లిప్‌కార్ట్ తెలిపింది.

గతంతో పోలిస్తే ఈ సీజన్ ఉద్యోగాల్లో మహిళా నియామకాలు 10 శాతం పెరిగాయి. వికలాంగులకూ ప్రత్యేకంగా ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఫ్లిప్‌కార్ట్ తెలిపింది. ఇక అమెజాన్ ఇండియా ఈ నెల ప్రారంభంలోనే ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు, సార్ట్ సెంటర్లు, లాస్ట్ మైల్ డెలివరీ స్టేషన్లలో 1.5 లక్షలకు పైగా తాత్కాలిక ఉద్యోగాలు కల్పించిన విషయం తెలిసిందే.






# ఐటీ షేర్ల అండ.. లాభాలతో ముగిసిన మార్కెట్లు

అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలతో దేశీయ మార్కెట్లు సోమవారం రాణించాయి. ఐటీ షేర్లలో కొనుగోళ్లు సూచీలను ముందుకు నడిపించాయి. దీంతో సెన్సెక్స్ 300 పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ 25వేల మార్క్‌కు మరింత చేరువైంది.

ఈ ఉదయం 81,501 పాయింట్ల వద్ద లాభాలతో ప్రారంభమైన సెన్సెక్స్ ఆరంభంలో కాస్త ఒడుదొడుకులకు లోనైంది. కానీ, దిగ్గజ రంగాల షేర్లలో కొనుగోళ్ల అండతో పుంజుకున్న సూచీ.. ఒక దశలో 81,799 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని తాకింది. ఆఖర్లో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో మళ్లీ ఒత్తిడికి గురైనప్పటికీ.. లాభాలను నిలబెట్టుకోగలిగింది. నేటి మార్కెట్ సెషన్‌లో సెన్సెక్స్ 329.05 పాయింట్ల లాభంతో 81,635.91 వద్ద స్థిరపడింది. అటు నిఫ్టీ 24,89425,021 మధ్య కదలాడింది. చివరకు 97.65 పాయింట్లు పెరిగి 24,967.75 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 6 పైసలు తగ్గి 87.58 వద్ద స్థిరపడింది. సెప్టెంబరులో అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోత అంచనాలతో ఐటీ రంగ సూచీ 2.3శాతం మేర రాణించింది. రియాల్టీ 0.7శాతం, లోహ రంగ సూచీ 0.6శాతం మేర పెరిగాయి. నిఫ్టీలో ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, విప్రో, హిందాల్కో ఇండస్ట్రీస్ షేర్లు లాభపడ్డాయి. అపోలో హాస్పిటల్స్, నెస్లే ఇండియా, భారత్ ఎలక్ట్రానిక్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఎస్‌బీఐ లైఫ్ షేర్లు నష్టపోయాయి.*

# బ్యాంక్ క్రెడిట్‌ను విస్తరించేందుకు చర్యలు: ఆర్‌బీఐ గవర్నర్

**అభివృద్ధికి అడ్డంకిగా ఉన్నవాటిని అధిగమించేందుకు తీవ్రస్థాయిలో కృషి చేస్తున్నామని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. వార్షిక బ్యాంకింగ్ సదస్సు 2025'లో ఆయన సోమవారం మాట్లాడుతూ బ్యాంక్ క్రెడిట్‌ను విస్తరించేందుకు అవసరమైన చర్యలను తాము పరిశీలిస్తున్నామని చెప్పారు. ఇన్వెస్ట్‌మెంట్ సైకిల్‌ను సృష్టించేందుకు వీలుగా కార్పొరేట్‌లు, బ్యాంక్‌లు ఓ తాటి పైకి వచ్చి పని చేయాలన్నారు. అప్పుడు దేశాభివృద్ధి ముందుకువెళుతుందని చెప్పారు. ధరల స్థిరీకరణ, ఆర్థికవృద్ధే లక్ష్యంగా ద్రవ్య పరపతి విధానం కొనసాగుతుందన్నారు.**

**స్థూలంగా భారత ఆర్థికవ్యవస్థ పునాదులు బలంగా ఉన్నాయని మల్హోత్రా అభిప్రాయపడ్డారు. ఒడిదొడుకులను ఎదుర్కొంటూ ఆశావాహ పరిస్థితి కొనసాగుతుందన్నారు. భారత్ మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించేందుకు రంగం సిద్ధమైందన్నారు. భారత్ వద్ద ఇప్పటికే 695 బిలియన్ డాలర్ల విదేశీ మారకద్రవ్య నిల్వలు ఉన్నాయని చెప్పారు. ఇవి 11 నెలల విదేశీ వాణిజ్యానికి సరిపోతుందన్నారు. ఇప్పుడు సమృద్ధ భారత్‌పై పనిచేయాలని సూచించారు. త్వరలో ఏర్పాటుచేయనున్న రెగ్యులేటరీ రివ్యూ సెల్ నిబంధనలను ప్రతి 5-7 ఏళ్లకు ఒకసారి సమీక్షిస్తుందని చెప్పారు.**






# ఇ20 పెట్రోల్‌తో ఇంధన సామర్థ్యం తగ్గొచ్చు

**దిల్లీ:** పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్‌ను కలిపి (బ్లెండెడ్ పెట్రోల్) వాహనాల్లో వినియోగించడంతో ఇంధన సామర్థ్యం 25 శాతం మేర తగ్గిపోవచ్చని వాహన పరిశ్రమ నిపుణులు అంచనా వేస్తున్నారు. కార్ల వేరియంట్ల ఆధారంగా ఇందులో కొద్దిగా తేడాలు ఉండొచ్చని భావిస్తున్నారు. ఇ20 ఇంధనం వాడకంతో వాహనాలపై ఎలాంటి ప్రభావం పడుతుందోనని సామాజిక మాధ్యమాల్లో చర్చ నడుస్తుండగా, వాహన రంగంలోని ప్రధాన కంపెనీల్లో పని చేస్తున్న ఇంజినీర్లు కొంత మంది స్పందించారు. ఇ20 రకానికి చెందని పాత వాహనాల్లో ఈ పెట్రోల్ వాడకంతో దీర్ఘ కాలంలో గ్యాస్కెట్లు, ఇంధన రబ్బరు గొట్టాలు, పైపులు కోతకు గురవుతాయని వారు వెల్లడించారు. తక్షణం ఎలాంటి ప్రభావం ఉండదని తెలిపారు.

# బాలీవుడ్‌లో చాలా తక్కువ పారితోషికం.. పెద్ద సినిమాల్లో ఛాన్సుల్లేవ్!

హీరోయిన్ సిమ్రాన్ ఇండస్ట్రీకి వచ్చి నేటి(ఆగస్టు 25)కి 30 ఏళ్లు పూర్తవుతుంది. హర్‌జై అనే హిందీ చిత్రంతో 1995లో కెరీర్ ప్రారంభించింది సిమ్రాన్. బాలీవుడ్‌లో కన్నా సౌత్‌లోనే ఎక్కువ స్టార్‌డమ్ తెచ్చుకుంది. తెలుగు, తమిళ భాషల్లో అనేక సినిమాలు చేసింది. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. హిందీలో నేను గుల్మోహర్ అనే సినిమా చేశాను. ఆ మూవీ టీమ్ అంతా కూడా చాలామంచివారు. అదే సమయంలో మరో ప్రాజెక్ట్ కూడా చేశాను. కానీ, అక్కడ ఎవరితోనూ కనెక్ట్ కాలేకపోయాను.

**వీడియో క్లిప్స్ పంపాలా?**

పైగా ఇక్కడ పాత్రకు నేను సూట్ అవుతానా? లేదా? అని లుక్ టెస్ట్ చేస్తుంటారు. అందుకు నేను అభ్యంతరమేమీ చెప్పను. ఓకే కానీ, కొందరు నాగురించి తెలియక.. పాత్రకు సరిపోతానో? లేదోనని వీడియో చేసి పంపించమంటారు. అంతేకాకుండా.. సౌత్ ఇండస్ట్రీలో ఇచ్చే రెమ్యునరేషన్‌లో పదో వంతు మాత్రమే చెల్లిస్తారు. అందుకే నా గురించి పూర్తిగా తెలుసుకున్నవారి దగ్గరే సినిమాలు చేయాలని నిర్ణయించుకున్నాను.

**పెద్ద సినిమాల నుంచి ఆఫర్లు లేవ్**

టూరిస్ట్ ఫ్యామిలీ తర్వాత చిన్న, మధ్య తరహా సినిమా అవకాశాలు చాలానే వచ్చాయి. అందులోనూ మహిళా ప్రాధాన్యత ఉన్న స్క్రిప్టులే ఎక్కువ! కానీ, పెద్ద ప్రొడక్షన్ హౌస్ నుంచి, బడా దర్శకనిర్మాతల నుంచి మాత్రం ఒక్క ఆఫర్ కూడా రాలేదు. నా కెరీర్‌లో చాలా హిట్లు ఉన్నాయి. ఎంతోమంది యంగ్ టాలెంట్ నన్ను ఆదర్శంగా తీసుకుంటున్నందుకు సంతోషంగా ఉంది అని చెప్పుకొచ్చింది.

**సినిమా**

ఈ ఏడాది సిమ్రాన్ ఫుల్ బిజీ. శబ్ధంతో అలరించిన ఆమె గుడ్ బ్యాడ్ అగ్లీలో అతిథి పాత్రలో మెరిసింది. టూరిస్ట్ ఫ్యామిలీతో సూపర్ హిట్టు అందుకుంది. ప్రస్తుతం ద లాస్ట్ వన్ అనే మూవీలో యాక్ట్ చేస్తోంది. విక్రమ్ సరసన నటించిన ధ్రువ నక్షత్రం ఇప్పటికీ విడుదలకు నోచుకోలేదు.







# 'ఫ్యూచర్ దళపతి' ట్యాగ్‌పై స్పందించిన శివ కార్తికేయన్

దళపతి విజయ్ పాలిటిక్స్‌లోకి వెళ్లడంతో.. తదుపరి దళపతి శివ కార్తికేయన్ అంటూ కోలీవుడ్‌లో కొన్ని రోజులుగా టాక్ వినిపిస్తోంది. ఈ క్రమంలో నెక్ట్స్ దళపతి, కుట్టి దళపతి, ఫ్యూచర్ దళపతి ట్యాగ్స్ తెరపైకి తీసుకొచ్చాయి. వాటిపై శివ కార్తికేయన్ స్పందించారు. ''అన్న ఎప్పుడూ అన్నే (విజయ్‌ని ఉద్దేశించి). తమ్ముడు ఎప్పుడూ తమ్ముడే'' అని పేర్కొన్నారు. విజయ్ అభిమానులను తాను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారన్న ఆరోపణపైనా శివ కార్తికేయన్ రియాక్ట్ అయ్యారు. ఏ నటుడూ మరొకరి ఫ్యాన్స్‌ను గెలవాలని అనుకోరని అన్నారు.

''ఇండస్ట్రీలో 15 ఏళ్లుగా కష్టపడుతున్నా. కొందరి అభిమానాన్ని పొందగలిగా. అది చాలు. సచిన్ తెందూల్కర్, ధోనీలాంటి వారినీ కొందరు విమర్శిస్తుంటారు. సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్‌పై మీరు స్పందించి, ఆవేశపడొద్దు'' అని అభిమానులకు విజ్ఞప్తి చేశారు. 'మదరాసి' మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మాట్లాడారు. అదే వేడుకలో హీరోయిన్ రుక్మిణీ వసంత్ మాట్లాడుతూ.. తాను శివకార్తికేయన్ అభిమానినని తెలిపారు. ఆయన అంకిత భావంతో పని చేస్తారని కొనియాడారు. తాను ఈ చిత్రంలో అతిథి పాత్ర పోషించినట్టు డైరెక్టర్ మురుగదాస్ తెలిపారు. ఈ సినిమా అదే పేరుతో తెలుగులోనూ సెప్టెంబరు 5న విడుదల కానుంది.

# వినాయక చవితికి దూరంగా శిల్పా శెట్టి.. ఆ కారణం వల్లే!

బాలీవుడ్ భామ శిల్పా శెట్టి అభిమానులకు బ్యాడ్ న్యూస్ చెప్పింది. ఈ ఏడాది వినాయక చవితి వేడుకలకు దూరంగా ఉంటున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. ప్రతి ఏడాది గ్రాండ్‌గా సెలబ్రేట్ ఈ పండుగను జరుపుకోవడం లేదని తెలిపింది. తమ కుటుంబంలో ఒకరి వియోగం కారణంగా వేడుకలకు దూరంగా ఉంటున్నట్లు వెల్లడించింది.

శిల్ప తన ఇన్‌స్టాగ్రామ్‌లో రాస్తూ.. "ప్రియమైన స్నేహితులారా బాధతో ఈ విషయాన్ని పంచుకుంటున్నా. మా కుటుంబంలో ఒకరి వియోగం కారణంగా ఈ సంవత్సరం మేము మా గణపతి వేడుకలను నిర్వహించుకోవడం లేదు. ఈ విషయాన్ని మీకు తెలియజేయడానికి మేము చింతిస్తున్నాం. మా సంప్రదాయం ప్రకారం 13 రోజుల పాటు సంతాప దినాలను పాటించాలి. అందుకే పండుగలు, ఉత్సవాలకు దూరంగా ఉంటాం.' అంటూ పోస్ట్ చేసింది.

# మిల్కీ బ్యూటీ తమన్నా లేటెస్ట్ వెబ్ సిరీస్.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే?

మిల్కీ బ్యూటీ తమన్నా ప్రస్తుతం పెద్దగా సినిమాలు చేయట్లేదు. ఈ ఏడాది ఓదెల-2 మూవీతో అలరించిన ముద్దుగుమ్మ.. అంతకుముందు ఒకట్రెండు స్పెషల్ సాంగ్స్‌లో మెరిసింది. ప్రస్తుతం బాలీవుడ్‌కే పరిమితమైన తమన్నా ఆసక్తికర వెబ్ సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకు రానుంది తమన్నా భాటియా, డయానా పెంటీ నటించిన కామెడీ-డ్రామా వెబ్ సిరీస్ 'డూ యు వన్నా పార్టనర్'. ఈ సిరీస్‌కు అర్చిత్ కుమార్, కాలిన్ డికున్హా దర్శకత్వం వహించారు. కరణ్ జోహార్, అదార్ పూనవల్లా, అపూర్వ మెహతా సంయుక్తంగా నిర్మించారు.

తాజాగా ఈ సిరీస్ స్ట్రీమింగ్ తేదీని మేకర్స్ ఫిక్స్ చేశారు. సెప్టెంబర్ 12 నుంచి అమెజాన్ ప్రైమ్ వేదికగా స్ట్రీమింగ్ కానుందని వెల్లడించారు. ఇద్దరు ప్రాణ స్నేహితుల కథ ఆధారంగా ఈ సిరీస్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఇద్దరు ఫ్రెండ్స్ సొంత ఆల్కహాల్ వెంచర్‌ను స్థాపించాలనే సాహసోపేతమైన నిర్ణయం ఎలాంటి మలుపులు తిరిగిందనేది ఈ సిరీస్‌లో చూపించనున్నారు. ఈ వెబ్ సిరీస్‌లో జావేద్ జాఫ్రే, నకుల్ మెహతా, సూఫీ మోతీవాలా, నీరజ్ కబీ, శ్వేతా తివారీ, రణ్విజయ్ సింఘా కీలక పాత్రల్లో నటించారు.





# వారసత్వంతోనో, పెళ్లితోనో కాదు..: ఉపాసన 'స్పెషల్' పోస్టు

**తాను ఎంచుకున్న రంగంలో ఎన్నో ఒత్తిళ్లు అధిగమించి ఓ స్థాయికి చేరుకోవడం వల్లే గుర్తింపు దక్కిందని, వారసత్వంతోనో, పెళ్లితోనో కాదని ప్రముఖ వ్యాపారవేత్త, నటుడు రామ్‌చరణ్ సతీమణి ఉపాసన పేర్కొన్నారు. తన పనిపై తనకే కొన్నిసార్లు సందేహం కలిగేదని, అప్పడప్పడు నిరుత్సాహపడ్డానని, మళ్లీ రెట్టింపు ఉత్సాహంతో మొదలుపెట్టే దానినని తెలిపారు. ఓ వ్యక్తిని ఏది ప్రత్యేకంగా నిలుపుతుందన్న అంశంపై సోషల్ మీడియాలో ఆమె ఓ పోస్టు పెట్టారు. 'ఖాస్ ఆద్మీ' పేరిట తన అభిప్రాయాలను పంచుకున్నారు.**

''ఓ వ్యక్తిని సంపద, హోదా, విజయం లాంటివి గొప్పగా చూపిస్తాయా? స్పందించే గుణం, ఇతరులకు సాయం చేయడం లాంటివి గొప్పవారిని చేస్తాయా? అనే వాటికి ఎవరికి వారే సమాధానం వెతుక్కోవాలి. మనల్ని మనం ప్రేమించుకొని, మనకు మనం విలువ ఇచ్చుకున్న క్షణం మనల్ని ప్రత్యేకంగా నిలుపుతుందని భావిస్తున్నా. వృత్తిపరమైన విజయాలనే సమాజం గుర్తిస్తోంది. మహిళలు పెద్ద కలలు కనేందుకు వారికి ఇచ్చే ప్రోత్సాహం తక్కువ. నేషనల్ మెంటల్ హెల్త్ సర్వే (2016) ప్రకారం.. 50 శాతం మంది భారతీయులు తాము అనుకున్న స్థాయికి వెళ్లలేకపోతున్నారు. ఈవిషయంలో దాదాపు 16 శాతం మహిళలు డిప్రెషన్‌కు గురవుతున్నారు. ముందు మిమ్మల్ని మీరు నమ్మండి. విజయం దానంతట అదే వస్తుంది''

''మార్పునకు ఎంతో సమయం పట్టదు. ఒక్క సెకనులో వచ్చే మీ ఆలోచనతోనే మొదలవుతుంది. నేను మీతో నిజాయతీగా ఉండాలనుకున్నా. అందుకే ఈ పోస్టు పెట్టా.

# కమర్షియల్ చిత్రాల్లో 1000 తప్పులు ఉన్నా పట్టించుకోరు కానీ..: అనుపమ




**హైదరాబాద్:** అనుపమ పరమేశ్వరన్ నటించిన నాయికా ప్రాధాన్య చిత్రం 'పరదా' . దర్శకుడు ప్రవీణ్ కండ్రేగుల తెరకెక్కించిన ఈ సినిమా ఈనెల 22న విడుదలైన సంగతి తెలిసిందే. సోమవారం నిర్వహించిన థాంక్స్‌మీట్‌లో అనుపమ, ప్రవీణ్, నటుడు రాగ్ మయూర్ తదితరులు పాల్గొన్నారు. అనుపమ మాట్లాడుతూ.. ''నేను నటించిన వాటిలో 'పరదా' నాకు చాలా ఇష్టం. కొందరు ప్రేక్షకులు వినోదాత్మక చిత్రాలు చూడాలనుకుంటారు. మరికొందరు కథాబలం ఉన్న ఇలాంటి సినిమాలు చూసేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. ఎవరి అభిప్రాయం వారిది. 'పరదా'ని ఓ ప్రయోగాత్మక చిత్రంగా పేర్కొంటూనే కొందరు అందులో తప్పులు వెతుకుతున్నారు. సినిమానే కాదు వ్యక్తిగత జీవితంలోనూ మనం ఏదైనా కొత్తగా ప్రయత్నిస్తే.. మిశ్రమ స్పందనే వస్తుంది. కమర్షియల్ చిత్రంలో 1000 తప్పులు ఉన్నా పట్టించుకోరు. కానీ, నాయికా ప్రాధాన్య చిత్రాల విషయంలో పరిస్థితి భిన్నంగా ఉంటుంది. మేం పడిన కష్టాన్ని గుర్తిస్తే చాలని కోరుకుంటున్నా. మీరు ప్రోత్సహిస్తే ఇలాంటి కొత్త కంటెంట్ చిత్రాలు వస్తాయి'' అని అభిప్రాయం వ్యక్తంచేశారు.

**భావోద్వేగానికి గురైన దర్శకుడు**

తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తారన్న ఆశతో లేడీ ఓరియెంటెడ్ మూవీ తెరకెక్కించానంటూ దర్శకుడు ప్రవీణ్ భావోద్వేగానికి గురయ్యారు. ''ప్రతి సినిమాలో పాజిటివ్, నెగెటివ్ ఉంటాయి. 'పరదా' విషయంలో భూతద్దంలో చూసి మరీ తప్పులు వెతికి, దాన్ని హైలైట్ చేస్తున్నారు. మంచి కంటెంట్‌ను వదిలేస్తున్నారు. సినిమా విడుదలై రోజులే అయింది. దాన్ని అప్పుడే జడ్జ్ చేయొద్దు. తెలుగులో ఇలాంటి కాన్సెప్టు సినిమా రాలేదని అనుకుంటున్నా. ముఖం కనిపించకుండా నటించేందుకు ఏ హీరోయిన్ అంగీకరిస్తుంది? కథను నమ్మి అనుపమ ఇందులో నటించింది. ఆమెకు జాతీయఅవార్డు రావాలని ఆకాంక్షిస్తున్నా'' అని అన్నారు.



# 'కాబోయే భార్యతో ఈవెంట్‌కు నారా రోహిత్.. సోషల్ మీడియాలో వైరల్!

టాలీవుడ్ హీరో నారా రోహిత్ నటించిన తాజా చిత్రం సుందరకాండ. ఈ చిత్రంలో వృతి వాఘాని, శ్రీదేవి విజయ్ కుమార్ హీరోయిన్లుగా నటించారు. వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకత్వంలో సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేశ్ మహంకాళి నిర్మించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ ఆగస్టు 27న థియేటర్లలో సందడి చేయనుంది.

ఈ సందర్భంగా మూవీ ప్రమోషన్లలో భాగంగా హైదరాబాద్‌లో సుందరకాండ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ ఈవెంట్‌లో నారా రోహిత్, మంచు మనోజ్ సందడి చేశారు. మొదటిసారిగా నారా రోహిత్ తన కాబోయే భార్య శిరీషాతో కలిసి ఈవెంట్‌కు హాజరయ్యారు. తొలిసారి ఈవెంట్‌లో కాబోయే టాలీవుడ్ జంట కనిపించడంతో ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.కాగా.. ఈ ఏడాది భైరవం మూవీతో అలరించిన నారా రోహిత్ తనపెళ్లి గురించి క్లారిటీ ఇచ్చారు. ఈ ఏడాది అక్టోబర్‌లో పెళ్లి చేసుకోబోతున్నట్టు ఆయన అధికారికంగా ప్రకటించాడు. అయితే నారా రోహిత్, నటి శిరీషాల నిశ్చితార్థం గతేడాది అక్టోబర్‌లో జరిగింది. త్వరలో పెళ్లి పనులు కూడా మొదలు పెట్టాలని అనుకున్నారు. కానీ ఆయన తండ్రి రామ్మూర్తి నాయుడు (72) నవంబర్‌లో అకాల మరణం చెందడం వల్ల పెళ్లికి బ్రేకులు పడ్డాయి.

'ప్రతినిధి 2' సినిమాలో నారా రోహిత్ సరసన శిరీష నటించిన విషయం తెలిసిందే. ఈ మూవీతో మొదలైన వారి స్నేహం ప్రేమగా మారింది. ఇరు కుటుంబ సభ్యుల సమక్షంలో నిశ్చితార్థం జరిగింది. ఇరు కుటుంబ సభ్యులను ఒప్పించి వారిద్దరు ప్రేమ వివాహం చేసుకుంటున్నారు. ఓజీ సినిమాతో శిరీషా ఈ ఏడాదిలో తెరపై సందడి చేయనున్నారు. ఆస్ట్రేలియాలో ఉన్నత విద్యని అభ్యసించిన శిరీషా స్వస్థలం రెంటచింతల అని తెలిసిందే.



# ప్రజ్ఞానందకు మరో 'డ్రా'

**నేటి నుంచి కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్**

**అహ్మదాబాద్:** ఏడాది విరామం తర్వాత భారత స్టార్ లిఫ్టర్, టోక్యో ఒలింపిక్స్ రజత పతక విజేత మీరాబాయి చాను పోటీల బరిలోకి దిగుతోంది. నేటి నుంచి ఇక్కడ జరిగే కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ఆమె స్టార్ ఆఫ్ అట్రాక్షన్ కానుంది. పారిస్ ఒలింపిక్స్‌లో కేవలం ఒక కిలోగ్రామ్ తేడాతో పోడియంలో నిలువలేక పోయిన మీరాబాయి తర్వాత గాయాల బారిన పడింది. దీంతో చాలా టోర్నీలకు ఆమె దూరం కావాల్సి వచ్చింది. ఇప్పుడు తాజాగా పతకం పట్టుపట్టేందుకు 32 ఏళ్ల మీరా 48 కేజీల కేటగిరీకి మారింది. లాస్ ఏంజెలిస్ 2028 ఒలింపిక్స్‌లో ఆమె రెగ్యులర్ కేటగిరీ కాకుండా 48 కేజీల కేటగిరీ ఉండటంతో ఇప్పటి నుంచే ఆ దిశగా కసరత్తు మొదలు పెట్టింది. వచ్చే ఏడాది గ్లాస్గోలో జరిగే కామన్వెల్త్ గేమ్స్‌కు ఈ తాజా చాంపియన్‌షిప్ క్వాలిఫయింగ్ టోర్నీ కావడంతో మీరాబాయి సత్తా చాటేందుకు సిద్ధమైంది. ఆమెతో పాటు కామన్వెల్త్ క్రీడల రజత విజేత బింద్యారాణి దేవి, కాంస్య విజేతలు హర్జిందర్ కౌర్, లవ్‌ప్రీత్ సింగ్‌లు సహా భారత లిఫ్టర్లే ఈ టోర్నీలో ఫేవరెట్లుగా బరిలోకి దిగుతున్నారు.

**భారత జట్ల వివరాలు:**

**మహిళలు:** మీరాబాయి చాను (48 కేజీలు), స్నేహా సోరెన్ (53 కేజీలు), బింద్యారాణి (58 కేజీలు), నిరుపమా (63 కేజీలు), హర్జిందర్ కౌర్ (69 కేజీలు), హర్మన్‌ప్రీత్ కౌర్ (77 కేజీలు), వన్షిత (86 కేజీలు), మెహక్ (+86 కేజీలు).

**పురుషులు:** రిషికాంత సింగ్ (60 కేజీలు), ఎం.రాజా (65 కేజీలు), నారాయణ అజిత్ (71 కేజీలు), వల్లూరి అజయ్ బాబు (79 కేజీలు), అజయ్ సింగ్ (88 కేజీలు), దిల్బాగ్ సింగ్ (94 కేజీలు), హర్‌చరణ్ సింగ్ (110 కేజీలు), లవ్‌ప్రీత్ సింగ్ (+110 కేజీలు).



# రాడుకాను శుభారంభం

**యూఎస్ ఓపెన్ టోర్నమెంట్**

**న్యూయార్క్:** టెన్నిస్ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ యూఎస్ ఓపెన్‌లో మహిళల సింగిల్స్ విభాగంలో మాజీ చాంపియన్ ఎమ్మా రాడుకాను (బ్రిటన్) శుభారంభం చేసింది. ఆదివారం మొదలైన ఈ మెగా టోర్నీలో తొలి రౌండ్‌లో రాడుకాను 6-1, 6-2తో ఇనా షిబహారా (జపాన్)పై గెలుపొందింది.
62 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో 2021 చాంపియన్ రాడుకాను రెండు ఏస్‌లు సంధించింది. నెట్ వద్దకు ఏడుసార్లు దూసుకొచ్చిన ఆమె ఐదుసార్లు పాయింట్లు గెలిచింది. తన సర్వీస్‌ను ఒక్కసారి కూడా కోల్పోని రాడుకాను ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. మరోవైపు షిబహారా ఐదు డబుల్ ఫాల్ట్‌లతోపాటు 36 అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకుంది.

**షెల్టన్ బోణీ**

పురుషుల సింగిల్స్ విభాగంలో ఆరో సీడ్ బెన్ షెల్టన్ (అమెరికా) గెలుపు బోణీ కొట్టాడు. ఇగ్నాసియో బుసె (పెరూ)తో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో షెల్టన్ 6-3, 6-2, 6-4తో విజయం సాధించి రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లాడు. 2 గంటల 7 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో షెల్టన్ ఐదు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. నెట్ వద్దకు 33 సార్లు దూసుకొచ్చి 26 సార్లు పాయింట్లు గెలిచాడు. 35 విన్నర్స్ కొట్టిన ఈ అమెరికా స్టార్ 32 అనవసర తప్పిదాలు చేశాడు. తన సర్వీస్‌ను ఒక్కసారి కూడా కోల్పోని షెల్టన్ ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగు సార్లు బ్రేక్ చేశాడు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో 16వ సీడ్ జాకుబ్ మెన్‌సిక్ (చెక్ రిపబ్లిక్) 7-6 (7/5), 6-3, 6-4తో నికోలస్ జారీ (చిలీ)పై, 18వ సీడ్ దేవిడోవిచ్ ఫోకీనా (స్పెయిన్) 6-1, 6-1, 6-2తో అలెగ్జాండర్ షెవ్‌చెంకో (కజకిస్తాన్)పై నెగ్గి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టారు.



# ఆసియా కప్ జట్టులో చోటు దక్కలేదు.. కట్ చేస్తే 'మెరుపు శతకం'తో బీభత్సం

ఆసియా కప్ కోసం ఎంపిక చేసిన పాకిస్తాన్ జట్టులో విధ్వంసకర బ్యాటర్ ఉస్మాన్ ఖాన్‌కు చోటు దక్కలేదు. ఫామ్‌లేమి కారణంగా పాక్ సెలెక్టర్లు అతన్ని పక్కన పెట్టారు. ఆసియా కప్ కోసం ఎంపిక చేయకపోవడాన్ని అవమానంగా భావించిన ఉస్మాన్ ఖాన్.. దేశవాలీ టీ20 టోర్నీలో తన ప్రతాపాన్ని చూపించాడు.
ఘనీ రాయల్ టోర్నీలో భాగంగా జరిగిన మ్యాచ్‌లో మెరుపు శతకంతో విరుచుకుపడ్డాడు. ఈ టోర్నీలో వైటల్ టీ జట్టుకు ఆడుతున్న ఖాన్.. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో 69 బంతుల్లో 16 ఫోర్లు, 6 సిక్సర్ల సాయంతో 138 పరుగులు చేశాడు. ఫలితంగా అతని జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 236 పరుగుల భారీ స్కోర్ చేసింది. అనంతరం ఈ భారీ లక్ష్యాన్ని సునాయాసంగా కాపాడుకుంది.
కాగా, ఉస్మాన్ ఖాన్‌కు పాక్ క్రికెట్ బోర్డు ఈ మధ్యకాలంలోనే మరో షాక్ కూడా ఇచ్చింది. ఈ ఏడాది సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితా నుంచి తొలగించింది. ఖాన్ గతేడాది డికేటగిరిలో కాంట్రాక్ట్ దక్కించుకున్నాడు. పేలవ ఫామ్ కారణంగా ఖాన్ పీసీబీ తాజాగా కాంట్రాక్ట్‌ను కూడా కోల్పోయాడు.
పీసీబీ తమ స్టార్ ఆటగాళ్లు బాబర్ ఆజమ్, మొహమ్మద్ రిజ్వాన్‌లను తమ అత్యున్నత కాంట్రాక్ట్ అయిన ఏ కేటగిరి నుంచి తప్పించి బి కేటగిరికి డిమోట్ చేసిన విషయం తెలిసిందే. అంతర్జాతీయ క్రికెట్‌లో దారుణంగా విఫలమవుతున్న కారణంగా పీసీబీ ఏ ఒక్క పాక్ ఆటగాడికి కూడా ఏ కేటగిరి కేటాయించలేదు.
30 ఏళ్ల ఉస్మాన్ ఖాన్‌కు పాక్ దేశవాలీ క్రికెట్‌లో మంచి ట్రాక్ రికార్డు ఉంది. పీఎస్ఎల్ ద్వారా ఇతను భారీ హిట్టర్‌గా పేరు గడించాడు. అయితే ఖాన్‌కు పాక్ తరపున పేలవమైన రికార్డు ఉంది. ఈ కుడి చేతి వాటం బ్యాటర్ తన దేశానికి ప్రాతినిథ్యం వహిస్తూ 19 టీ20ల్లో కేవలం 239 పరుగులు మాత్రమే చేశాడు. ఇందులో ఒక్క అర్ధ సెంచరీ మాత్రమే ఉంది. పాక్ తరపున 2 వన్డేలు కూడా ఆడిన ఖాన్.. ఇక్కడ కూడా విఫలమయ్యాడు.

# చెలరేగిపోతున్న ఢిల్లీ క్యాపిటల్స్ చిచ్చరపిడుగు

**ఉత్తర్‌ప్రదేశ్ టీ20 లీగ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ యువ ఆటగాడు సమీర్ రిజ్వీ (21) ఆకాశమే హద్దుగా చెలరేగుతున్నాడు. ఈ టోర్నీలో కాన్పూర్ సూపర్ స్టార్స్‌కు సారథ్యం వహిస్తున్న అతడు.. వరుస విధ్వంసాలతో హోరెత్తిస్తున్నాడు. కొద్ది రోజుల కిందట గోరఖ్‌పూర్ లయన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 49 బంతుల్లో 93 పరుగులు చేసిన రిజ్వీ.. ఇవాళ మీరట్ మెవెరిక్స్‌పై అజేయమైన మెరుపు అర్ధ శతకంతో (48 బంతుల్లో 78) మెరిశాడు.**

**ఈ మ్యాచ్‌లో రిజ్వీ మెరుపు ఇన్నింగ్స్‌కు లక్ కూడా తోడవ్వడంతో కాన్పూర్ జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కాన్పూర్.. మీరట్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 149 పరుగులు మాత్రమే చేయగలిగింది. కాన్పూర్ ఇన్నింగ్స్‌లో రిజ్వీ ఒక్కడే రాణించాడు.**

సహచరులు ఒక్కో పరుగు సాధించేందుకు ఇబ్బంది పడుతుండగా.. రిజ్వీ భారీ షాట్లతో చెలరేగాడు. 7 ఫోర్లు, 5 సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. జట్టు స్కోర్‌లో రిజ్వీ ఒక్కడే సగానికి పైగా చేశాడు.

అనంతరం స్వల్ప లక్ష్య ఛేదనకు దిగిన మీరట్‌ను వరుణుడి రూపంలో దురదృష్టం వెంటాడింది. ఆ జట్టు స్కోర్ 41/2 వద్ద (8 ఓవర్ల తర్వాత) ఉండగా భారీ వర్షం మొదలైంది. వరుణుడు ఎంతకీ శాంతించకపోగా డక్ వర్త్ లూయిస్ పద్ధతిన కాన్పూర్‌ను విజేతగా ప్రకటించారు.

మ్యాచ్ ఆగిపోయే సమయానికి మీరట్ గెలుపుకు 14 పరుగుల దూరంలో (డక్ వర్త్ లూయిస్ పద్ధతిలో) ఉండింది. ఆర్సీబీ యువ ఆటగాడు స్వస్తిక్ చికారా (29), మాధవ్ కౌశిక్ (4) క్రీజ్‌లో ఉన్నారు.

కాగా, సమీర్ రిజ్వీ గత ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆడిన విషయం తెలిసిందే. ఈ సీజన్‌లో అతడు పెద్దగా రాణించకపోయినా, చివరి మ్యాచ్‌లో ఒత్తిడిలో అజేయమైన అర్ధ సెంచరీ చేసి పర్వాలేదనిపించాడు. యూపీ లీగ్‌లో తాజా ప్రదర్శనలతో రిజ్వీ మరోసారి డీసీ మేనేజ్‌మెంట్ దృష్టిలో పడి ఉంటాడు. ఈ ప్రదర్శనలు అతడికి మరిన్ని ఐపీఎల్ అవకాశాలు తెచ్చిపెట్టవచ్చు.



# ఆ రెండు మ్యాచ్‌ల ఫలితాలను మార్చాలనుకుంటా: రాహుల్ ద్రవిడ్

**ది గ్రేట్ వాల్ ఆఫ్ ఇండియాగా పేరున్న రాహుల్ ద్రవిడ్ చాలా మ్యాచుల్లో భారతజట్టును విజయతీరాలకు చేర్చాడు. అయితే తన కెరీర్‌లో భాగమైన ఓ రెండు మ్యాచ్‌ల ఫలితాలను (ఓటములను) మాత్రం మార్చాలనుకుంటానని రాహుల్ ద్రవిడ్ అన్నాడు. రవిచంద్రన్ అశ్విన్ యూట్యూబ్ ఛానల్‌లో ఈ విషయాన్ని అతడు వెల్లడించాడు. అందులో ఒకటి 1997లో బార్బడోస్‌లో వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్ కాగా, మరోటి ఆస్ట్రేలియాతో జరిగిన 2003 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్.**



'నేను ఓ రెండు ఓటముల ఫలితాలను మార్చాలనుకుంటున్నాను. 1997లో బార్బడోస్‌లో వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో మేం 120 పరుగులను ఛేదించాల్సి వచ్చింది. కానీ అప్పుడు 81 పరుగులకే ఆలౌట్ అయ్యాం. కానీ అప్పుడు మేం ఆ మ్యాచ్‌లో విజయం సాధించి ఉంటే, సిరీస్‌ను కూడా కైవసం చేసుకునేవాళ్లం. అలాగే దక్షిణాఫ్రికాలో ఆస్ట్రేలియాతో జరిగిన 2003 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్. మేం అప్పుడు టాస్ గెలిచి సరైన నిర్ణయం తీసుకున్నాం. ఎందుకంటే అప్పుడు మేఘావృతమై ఉంది. కానీ ఆస్ట్రేలియా చాలా బాగా బ్యాటింగ్ చేసింది. దీంతో మేం ఆ మ్యాచ్‌లో ఓడిపోయాం. నేను ఈ మ్యాచ్ ఫలితాన్ని కూడా మార్చాలని కోరుకుంటున్నా' అని ద్రవిడ్ అన్నాడు.

**ఆ రెండు మ్యాచుల్లో ఏం జరిగిందంటే..**

సచిన్ తెందూల్కర్ కెప్టెన్సీలో 1997లో బార్బడోస్‌లో వెస్టిండీస్‌తో టీమ్ఇండియా తలపడింది. 120 పరుగులను ఛేజ్ చేస్తూ టీమ్ఇండియా 81 పరుగులకే ఆలౌటైంది. ఈ మ్యాచ్‌లో రాహుల్ ద్రవిడ్ మొదటి ఇన్నింగ్స్‌లో 78 పరుగులు చేశాడు. టీమ్ఇండియా 21 పరుగుల ఆధిక్యం సాధించింది. కానీ ద్రవిడ్ రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 2 పరుగులకే ఔటయ్యాడు. అప్పుడు జట్టులో కేవలం వీవీఎస్ లక్ష్మణ్ మాత్రమే రెండంకెల స్కోర్ (19) సాధించాడు.

సౌరభ్ గంగూలీ సారథ్యంలో టీమ్ఇండియా 2003 వరల్డ్ కప్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. తుదిపోరులో ఆస్ట్రేలియాతో తలపడాల్సి వచ్చింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన టీమ్ఇండియా మొదట బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 359 పరుగుల భారీ స్కోర్ చేసింది. టీమ్ఇండియా 234 పరుగులకే ఆలౌటైంది. దీంతో కంగారూ జట్టు ఈ మ్యాచ్‌లో 125 పరుగులతో విజయం సాధించి వరల్డ్ కప్‌ను కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో ఆసీస్ కెప్టెన్ రికీ పాంటింగ్ భారీ శతకం (121 బంతుల్లో 140) సాధించాడు. భారత ఇన్నింగ్స్‌లో వీరేంద్ర సెహ్వాగ్ (82) తర్వాత, అత్యధిక పరుగులు చేసింది రాహుల్ ద్రవిడే (47). మిగతా బ్యాటర్లంతా విఫలమయ్యారు.

# డ్రీమ్ 11తో కటీఫ్.. అధికారికంగా ప్రకటించిన బీసీసీఐ



**ఢిల్లీ: భారత జట్టుకు ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరించిన డ్రీమ్ 11తో బీసీసీఐ ఒప్పందం రద్దు చేసుకుంది. ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందిన నేపథ్యంలో ఈమేరకు నిర్ణయం తీసుకుంది. భవిష్యత్తులోనూ ఇలాంటి సంస్థలతో సంబంధాలు కొనసాగించబోమని బీసీసీఐ సెక్రటరీ దేవాజిత్ సైకియా అధికారికంగా వెల్లడించారు.**

ఇప్పటికే డ్రీమ్ 11 ప్రతినిధులు బీసీసీఐ కార్యాలయానికి వెళ్లి సంప్రదింపులు జరిపారు. కొత్త చట్టం కారణంగా తాము ఈ ఒప్పందాన్ని కొనసాగించలేమని వారు చెప్పినట్లు తెలుస్తోంది. మరికొన్ని రోజుల్లో ఆసియా కప్ ప్రారంభం కానున్న నేపథ్యంలో బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడు డ్రీమ్11 స్థానంలో కొత్త స్పాన్సరర్‌ను వెతుక్కునే అవసరం ఏర్పడింది. అందుకోసం త్వరలోనే టెండర్లు ప్రారంభించనున్నట్లు బీసీసీఐ వర్గాల సమాచారం.

మూడేళ్ల కాలానికి 2023లో బీసీసీఐతో డ్రీమ్ 11 రూ.358 కోట్లతో ఈ ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు మధ్యలో నిష్క్రమించాల్సి వచ్చింది. అయినప్పటికీ.. ఈ సంస్థపై భారత క్రికెట్ మండలి ఎలాంటి జరిమానా విధించడం లేదట. ఒప్పందం ప్రకారం చట్టపరమైన కారణాలతో మధ్యలో స్పాన్సర్‌షిప్‌ను వదిలేసినా.. ఎలాంటి జరిమానా పడకుండా నిబంధన ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలాఉండగా.. పలు ఐపీఎల్ ఫ్రాంఛైజీలకూ డ్రీమ్11 స్పాన్సరర్‌గా వ్యవహరిస్తోన్న సంగతి తెలిసిందే. ఆ జట్లు కూడా ఇప్పుడు సంబంధాలు తెంచుకునే అవకాశాలున్నాయి.

మరోవైపు, డ్రీమ్ 11 మాతృసంస్థ డ్రీమ్ స్పోర్ట్స్ ఆర్థికసేవల రంగంలోకి అడుగుపెట్టనున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం కొత్త యాప్ 'డ్రీమ్ మనీ'ని అందుబాటులోకి తేనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ యాప్ ప్రయోగాత్మక దశలో ఉంది. గూగుల్ ప్లే స్టోర్ వద్ద లభ్యమవుతున్న సమాచారం ప్రకారం పసిడి కొనుగోలు, ఫిక్స్‌డ్ డిపాజిట్ సేవలను డ్రీమ్ మనీ యాప్ అందివ్వనుంది.